



# మధుర విషాద గానం

బొమ్మిరెడ్డిపల్లి భానుశ్రీ

**కోజీగా** ఉంది రూమ్. ఏదో సమావేశం— ప్రఖ్యాత కవి మాట్లాడుతున్నాడు. కుర్చీలన్నీ నిండి ఉన్నాయి. కొత్త వ్యక్తి లోపం కొచ్చేడు. కూచోడాని కెక్కడా జాగా లేదు. తన పక్కకి వచ్చేడు. విక్రమ్!... పక్కకి జరిగి చోటిచ్చింది. విక్కీ...సాహిత్య సభకు ఎలా వచ్చేడు! తన చుట్టూ చేయి వేసి గట్టిగా హత్తుకుంటూ ఏదో మాట్లాడుతున్నాడు. అబ్బా... ఏదో ఇబ్బందిగా ఉంది. ఇద్దరూ బయటికి వచ్చేరు. తన చేతిలో పుస్తకాలు.

"విక్కీ... నువ్విక్కడే ఉండు. ఈ పుస్తకాలు ఇచ్చేసి వస్తాను." పెద్ద హాలు. చీకటిగా... నిశ్శబ్దంగా... అరే! ఏమయిపోయారు వీళ్ళంతా! గదిలో ఒక వస్తువు లేదు... ఒక మనిషి లేదు... పక్క రూమ్‌లోకి...ఆ పక్క రూమ్... మరో రూమ్... ఇంకో రూమ్... ఎవ్వరూ కనబడరేం! విక్కీ తనకోసం వెయిట్ చేస్తుంటాడు. లేదు. ఈ చీకటి గదుల కంతం లేదు. ఏమీ కనబడ్డం లేదు. ఇవన్నీ దాటుకుని మళ్ళీ వెనక్కి ఎలా వెళ్ళడం! విక్కీ... ఎన్నాళ్ళకి కనిపించేడు విక్కీ... చీకటి... నిశ్శబ్దం... ఒంటరితనం... తరుము కొస్తున్నాయి. తన కోసం వెయిట్ చేస్తుంటాడు విక్కీ... పరుగెడుతుంది తను... అదుగో... గేటు దగ్గర విక్కీ... ఇంకా పరుగెడుతూంది. ఈ దూరం తరగడం లేదు. విక్కీ... విక్కీ... అందుకోనందా? ఎవరితో మాట్లాడుతున్నాడు? ఎవరా అమ్మాయి? ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడ? ఎక్కడ?? విక్కీ...విక్కీ... నా మాట. నా అరుపు, నా పిలుపు వినబడ్డం లేదా? ఒక్క నిముషం ఉండు, విక్కీ... ఒక్క మాట విను. వెళ్ళిపోతున్నాడు. అదిగో— ఆ చెట్ల మధ్య నించి—ఆమెతో... విక్కీ...విక్కీ... ఏడుపొస్తూంది... నువ్వు లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేను, విక్కీ... ఓహ్! ఎంతకని ఈ పరుగు! ఇంకా ఎంత దూరం? ఏడుపొస్తూంది. హెల్ప్‌లెస్‌గా... అలసటగా...విక్కీ... మై డార్లింగ్ విక్కీ...

"పద్మినీ .. పద్మినీ..." కుదుపుతున్నా రెవరో...

"ఏమిటి, పద్మినీ, కలవరిస్తున్నావు?"

కళ్ళు తెరిచి చూసింది పద్మిని. "వీణా!" మెల్లిగా, క్షీణంగా అంది. "వీణా! వీణా!"

మంచినీళ్ళు తెచ్చింది వీణ... "ఇంకేం ఆలోచించకుండా పడుకో... పొద్దున్నే లేవాలి." దుప్పటి సరిగా కప్పి లైటార్పి వెళ్ళిపోయింది వీణ తన గదిలోకి.

తెల్లవారడానికింకా నాలుగ్గంటలు. కాలం కదలికను సూచిస్తూ గోడ గడియారం చప్పుడు... చుట్టూ చావులాంటి చీకటి... నిశ్శబ్దం. జీవితం చేస్తున్న అర్థం లేని శబ్దాలు.

కలలో కూడా ఆ స్పర్శ, అనుభవం ... ఎంత హాయిగా... వెచ్చగా...విక్కీ, మై డార్లింగ్... నిన్ను చూసే దాకా, నీ కౌగిలిలో కరిగిపోయే దాకా నాకు మనశ్శాంతి లేదు.

అటూ, ఇటూ దొర్లింది పద్మిని.

కాలం కదులుతోంది నెమ్మదిగా.

అనాలోచితంగా లేచి కిటికీ తలుపులు తెరిచింది పద్మిని. అమృతాన్ని వెదజల్లుతూ వెన్నెల కిరణాలు దూసుకువచ్చేయి లోపలికి. క్షణంసేపు ఝల్లుమంది హృదయం... వీథంతా మందంగా పరుచుకున్న దట్టమైన పొగమంచు ... వెన్నెల...తెల్లటి చందమామలో కనబడని సముద్రాలు . . .

"చందమామ, వెన్నెల అని అలా కొట్టుకుపోతావు, ఏదీ చందమామ?" తన ఒళ్ళో పడుకుని కళ్ళలోకి చూస్తూ అడిగేడు విక్రమ్.

"నువ్వొచ్చేవుగా—ఇంకా చందమామ అక్కర్లేదు నాకు..." అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ అంది.

అర్థం కాని భాషలో హోరు పెడుతున్న సముద్రం... మెత్తటి ఇసుక... చీకటి దించుతున్న సన్నటి కాటుక తెరలు...

పద్మిని — విక్రమ్ — హృదయాలు పడే తపన — ఆరాటం...

అదే లోకం— అదే నిజం— అదే అస్తిత్వం—

"డార్లింగ్! నన్ను—నన్నెప్పుడూ మధ్యలో వదిలేయవు కదూ!... నీ స్నేహం, నీ ప్రేమ లేనిదే నేను ఉండలేను..."

"ఒహ్! విక్కీ...అదేనా నువ్వు చెప్పే మాట!"


"నీ దగ్గరుంటే నాకెంతో మనశ్శాంతి. నేనెంతో సాధించగలను. నువ్వు నాతో ఉంటే ఈ ప్రపంచాన్నే జయించగలను. ఈ ప్రపంచంలో నన్నెవరయినా శాసించగలరనుకుంటే — అది నువ్వే! ఐ ఒబే యూ—నేనో సైనికుణ్ణి మాత్రమే...నువ్వో పెద్ద మహారాణివి. పద్మినీ...నా రాణీ...యు ఆర్ మై ఎవ్విరిథింగ్.." ఆవేశంగా అంటున్న అతని పెదవుల్ని మన్నితంగా తన పెదవులతో మూస్తూ గట్టిగా—చిన్న పిల్లాడిలా పూర్తిగా తనలో కలిపేసుకోవాలన్నంత ఆత్రతగా హత్తుకుంటూ నెమ్మదిగా అంది: "నిన్ను నా నించి ఎవ్వరూ దూరం చెయ్యలేరు, విక్కీ."

విక్కీ...ఎక్కడున్నావు, విక్కీ...ఏమయిపోయావు? నా నుంచి ఎందుకంత దూరం వెళ్ళిపోయావు? ఎలా వెళ్ళగలిగేవు?

హృదయంలోని వేదన ఆమె కళ్ళలోంచి ప్రవహిస్తోంది.

నువ్వు లేని నా జీవితానికి అర్థమేమిటి?

ఇంటి ముందు లాన్‌లో కుర్చీలో




కూర్చుని ఏదో రాసుకుంటూంది పద్మిని. గేటు తీసుకుని లోపలి కొచ్చేడు విక్రమ్.

"గుడీవినింగ్, బేబీ..."

"హాయ్, విక్కీ... ఎప్పుడొచ్చావు?"

"పొద్దున్నే—నువ్వెలాగా ఇంట్లో ఉండవు కదా అని వెంటనే రాలేదు."

"ఇంట్లో లేకపోతే యూనివర్సిటీకి రాకూడదా?"

"ఎందుకు డిస్టర్బ్ చేయ్యడంలే అని.."

"డోంట్ టాక్ షిట్— ఇష్టం లేదని చెప్పకూడదూ!"

"ఇష్టం లేదు. సరేనా?"

ఒకసారి కోపంగా అతనివైపు చూసి, పక్కకి తిరిగి పుస్తకం తీసి తెరవబోయింది.

పుస్తకం తెరవకుండా చెయ్యడ్డం పెడుతూ అన్నాడు: "ఏవీవే—ఇప్పుడొచ్చేనుగా."

"అలా నించునే మాట్లాడతావా?" కాగితం మీద ఏదో రాస్తూ అంది.

"నేను కూర్చోడానికి రాలేదు."

వినిపించుకోకుండా రాస్తోంది.

"నేను షాపింగ్‌కి వెళ్ళాలి." గట్టిగా అన్నాడు.

"వెళ్ళు."

"నీ పర్మిషన్‌కోసం రాలే దిప్పుడు."

"మరి..."

"నువ్వు నాతో రావాలి."

"సారీ ! రేపు నేనీ ఎస్సైన్‌మెంటు అర్జెంటుగా సబ్మిట్ చెయ్యాలి."

"నేను పెన్ కొనుక్కోవాలి."

"పెన్నా!...నీకా?"... నవ్వింది.

"ఇందులో నవ్వడానికేముంది?"

"ఏం లేదు. గన్‌లు పట్టుకునేవారికి పెన్ లెందుకా అని! జీప్‌లు, జావాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లు నడిపే రఫ్ అండ్ టఫ్ మనిషికి..."

"ఇప్పుడు పెన్ కావలసొచ్చింది...సరేనా?" సీరియస్‌గా అన్నాడు.

"సరే...వెళ్ళి కొనుక్కో."

"యూ బ్లడీ బేబీ! నేన్నిన్ను తీసుకెళ్ళడాని కొచ్చాను." అసహనంగా అరిచేడు.

"సారీ."

ఆమె చేతిలో పెన్ను లాక్కుని రాస్తున్న పేపర్లన్నీ తీసి ఒక మూల రోజాప్లాంట్ వెనక పడేసి వచ్చేడు విక్రమ్.

విసురుగా లేచిందిపద్మిని. "ఛీ, ఛీ—అడివి మనిషి కాగితం విలువే తెలీని మనిషికి పెన్ను కావాలట— పెన్ను!" కాగితాలు దులుపుతూ తీసుకొచ్చి కూర్చుంది విసుగ్గా!

"సీ, డియర్, చివరిసారిగా అడుగుతున్నాను— వస్తావా, రావా?"

"నో, నో." వెంటనే అంది విసురుగా.

"సరే..." గబగబా వెళ్ళిపోయేడు.

పేపర్లు ఎగిరిపోకుండా రాధాకృష్ణన్ "ఈస్ట్ అండ్ వెస్ట్" అడ్డంపెట్టి నెమ్మదిగా గేటు దగ్గరికి వచ్చి తొంగిచూసింది పద్మిని. ఫెన్సింగ్ పక్కన రాయిమీద కూర్చుని అసహనంగా బోగన్ విల్లా ఆకులు చిదుపుతున్నాడు విక్రమ్. తేలిక పడిన మనసుతో నవ్వుకుంటూ అంది—

"ఇంకా వెళ్ళలేదా?"

"నువ్వు వచ్చేవరకు ఇక్కడే ఉంటాను." చిదిపిన ఆకులు ఆమెమీదకు విసురుతూ అన్నాడు.

"మొండి— రాత్రి చాలసేపటివరకు రాయాలి నేను."

"సరే రాత్రంతా ఇలాగే కూర్చుంటాను నేను."

చటుక్కున వెళ్ళి అతని మొహాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకోవాలనిపించింది...చల్లటి మంచుగాలి రివ్వున లోపలి కొచ్చింది. చటుక్కున కిటికీ తలుపులు మూసి బెడ్‌మీద పడుకుని రగ్గు మెడవరకు దగ్గరగా లాక్కుంది. సన్నటి లేత నీలం రంగు కాంతిలో గది అంతా చల్లగా, ప్లెజెంటుగా ఉంది. ఎదురుగా గోడమీద "మేడ్ ఫర్ ఈచ్ అదర్" పోస్టర్. సముద్రపొడ్డున ఇసుకలో నడుస్తున్న అందమయిన జంట — అమ్మాయి

చుట్టూ చేతులు వేసి నడుస్తున్న అబ్బాయి. సన్నటి వీ రెండలో వింతగామెరుస్తున్నారు...పద్మిని, విక్రమ్!

"ఓహ్...లవ్లీ!" సడెన్‌గా ఆగి కిందకి వంగి వెనక్కి జారిపోతున్న నీళ్ళలోంచి, ఇసుకలో కూరుకు పోయిన శంఖాన్ని పైకి తీస్తూ అంది పద్మిని.

"చాల బావుందికదూ!" నీటిలో తడిపి హేంకీతో తుడుస్తూ అంది.


"ఛ! ఏం బావుంది—ఇంతకన్న అందమయిన వస్తువులు ఎన్నయినా కొనిపెడతాను."

"సర్లేవోయ్ పెద్ద. ఏనా ఒప్పుకున్నావు గనక నేనన్న మాటని!"

"అవును. పోనీ నువ్వే చెప్పు. ఏమయినా బావుందా ఇది?" పరిశీలనగా చూస్తూ అన్నాడు.

"సరే...చూడు. రేపు ఎంత బాగా తయారు చేస్తానో దీన్ని." బేగ్‌లో వేసుకుంటూ స్థిరంగా అంది.

సూర్యాస్తమయం. పూరు వెనక్కి పడి




పోతున్న సూర్యుడికి వెలవెలబోతూ వీడ్కోలు చెపుతున్నాయి సముద్రపు నీళ్ళు.

"పద్మినీ .. రేపు వెళ్ళిపోదామనుకుంటున్నాను."

ఆగింది పద్మిని. దిగులుగా చూస్తూ అంది: "మళ్ళీ ఎప్పుడు? అసలు కలుస్తామా విక్కీ?"

"పిచ్చీ.. నిన్ను కలవకుండా, చూడకుండా నే నుండగలనా! విశాఖ వచ్చేదే నీకోసం. ఎన్ని పూళ్ళు తిరగనీ, విశాఖే నా డెస్టినీ—" ఆమె చుట్టూ చేతులు వేసి నడుస్తున్నాడు.

నడక...అంతంలేని నడక...

"హే...టూఫర్ జాయ్!" సంతోషంగా అరిచింది పద్మిని.

ఎమోషనల్ సముద్రాన్ని నిశ్శబ్దంగా తిల కిస్తున్న రెండు పక్షులు.

విక్రమ్ కొంచెం ముందుకు నడిచి ఆ రాయి మీద కూర్చున్నాడు. ఎగిరిపోయాయి పక్షులు, అలికిడికి.

"ఛ—ఏం పని చేశావు! చూడు, ఎలా డిస్టర్బ్ చేశావో వాటిని! డిస్ట్రక్టివ్ క్రీచర్!" నొచ్చు కుంటూ అంది.

"పక్షులకేంఎక్కడున్నా కూచుంటాయి!" తాపీగా రాయిమీద కూర్చున్నాడు. "కమాన్, బేబీ!"

"నేను రాను. ఆ కెరటాల్లో తడవడం నాకిష్టం లేదు" కోపంగా, ఫర్మ్‌గా అంది.

రాయి దిగి ఆమె చెయ్యి లాగి కూర్చోపెట్టాడు.

పక్కనే కూర్చుని అతని భుజంమీద తల వాల్చింది పద్మిని. ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి పట్టుకున్నాడు విక్రమ్. "పద్మినీ" మొహం లోకి చూస్తూ అన్నాడు... "మాట్లాడవా!"

ఆమె మొహంలో ఏ భావంలేదు. పశ్చిమాన అలుముకున్న వింత రంగులు గజిబిజిగా ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి.

"అంత డల్‌గా ఉండకు, డియర్, నాకు బాగుండదు."

రెస్ట్‌లెస్‌గా వచ్చి రాయిని బద్దలు కొడుతున్నాయి కెరటాలు. మీద పడుతున్న తుప్పర అదో రకం హాయిగా ఉంది. అందమయిన డిస్టర్బెన్స్. మెత్తటి ఆమె అరచేతి మీద రాస్తూ అన్నాడు:

"డార్లింగ్ ఒక మాట చెప్పు. నన్నెప్పుడూ వదిలి పెట్టవు కదూ!"

చురుగ్గా తలెత్తి చూసింది అతని వైపు పద్మిని. అతని కళ్ళలో అర్థంకాని నీలినీడలు. గాలికి వెనక్కి విరిగి విపరీతంగా ఎగురుతోంది అతని జుత్తు. "ఇంకోసారి ఆ మాటంటే ఈ నీళ్ళలోకి తోసేస్తాను."

"అంతకన్న నా క్కావలసిందేముంది? నీ చేతుల్లో, నీ ఒడిలో చచ్చిపోతే నా కింకే సమస్యలూ ఉండవు. అంతకన్న పీస్‌ఫుల్ డెత్ ఇంకోటుందా?"

"విక్కీ... మై డార్లింగ్ విక్కీ... ఎందు కలా మాట్లాడతావు?" ఆవేశంగా అతని మొహాన్ని కిందికి వంచి హత్తుకుంటూ అంది: "నీకోసం నే నెప్పుడూ ఉన్నాను. నీ ప్రాబ్లమ్స్, కష్టాలు నావి కావా! అయామ్ ఆల్వేస్ ఫర్ యూ!"

"పద్మినీ! నువ్వు నా కెంతో హేపినెస్ ఇస్తున్నావు. స్నేహాన్ని, ప్రేమని ఇస్తున్నావు. ఫలితంగా నే నీకేం ఇస్తున్నాను?"

ఏం మాట్లాడలేదు పద్మిని. ఇంకా గట్టిగా హత్తుకుని తలమీద చిన్నగా ముద్దుపెట్టుకుంది.

ఆమె గుండెలో ఒదిగిపోయి తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు విక్రమ్. ప్రపంచంలోని విశ్రాంతి అంతా ఇక్కడే ఉందా!

"విక్కీ...ఒక్కసారి నాకు కనబడు, విక్కీ. నీ కోసం ప్రపంచాన్నంతా వదిలేశాను నేను. నువ్వే దూర మయిపోతే ఇంక... ఇంక... నాకేం మిగుల్తుంది?" హృదయపు లోతుల్లోంచి పాతాళ గంగలా పూరు తోంది కన్నీరు.

నాలుగ్గంటలు కొట్టింది గడియారం. అలసటగా కళ్ళు మూసుకుంది పద్మిని.

• • • •

ఇడ్లీలు, చట్నీ, బ్రెడ్ స్లైసెస్, బటర్, కాఫీ సర్దుతోంది టేబిల్ మీద వీణ. స్నానం చేసి డ్రెస్ చేసుకుని, చేతికి వాచీ తగిలించుకుంటూ వచ్చింది పద్మిని.

"మోర్నింగ్, పద్మినీ. రాత్రంతా నిద్రపోలేదు. పొద్దున్నే లేచి చదువుతా ననుకున్నాను."

ఏం మాట్లాడలేదు పద్మిని. ఇడ్లీ ముక్కలు కొరుకుతోంది.

కిటికీ తెరలు బ్రాడ్‌గా తెరిచి, నైట్ డ్రెస్ సరిగ్గా కట్టుకుంటూ వచ్చి కూర్చుంది వీణ.

"విక్రమ్ ఇక్కడే ఉన్నట్టున్నాడు."

"వూ!" వెచ్చగా పడుతున్నాయి సూర్య కిరణాలు కిటికీలోంచి.

"నువ్వు వస్తున్నట్టు ఇన్‌ఫామ్ చేసేవా?" కాఫీ కలుపుతూ అడిగింది.

"వీణా! సంవత్సరం నుంచి తననించి ఏ విషయం తెలీదు. అప్పుడప్పుడు నేనే రాస్తున్నాను లెటర్స్. దేనికీ జవాబు లేదు. ఇక్కడి కొచ్చే ముందు కూడా రాసేను. అయినా ..."

'హమ్ తుమ్ సే జుదాహోకే మర్ జాయెంగే రో రోకే..' వివిధ భారతిలో రఫీ.

పద్మిని గుండెలో దిగులు. సన్నటి కోత.

"రాత్రి ఎందు కలా ఎగ్జైట్ అయేవు? ఏమిటంత ఏంగ్జైటీ డ్రీమ్?" సైకాలజీలో రీసెర్చ్ స్కాలర్ వీణ.

"ఏమిటో, వీణా, నా ఎగ్జైట్మెంట్ నా కర్థం కావడం లేదు." కప్పు టేబిల్ మీద పెట్టి లేస్తూ అంది.

తొమ్మిది కొట్టింది గడియారం. "తరవాత మాట్లాడదాం—బై ... బై ..."

"గుడ్‌లక్ ... బాగా రాయి."

రిజర్వ్ బేంక్—టాప్ ఫ్లోర్ ... లిఫ్ట్ లోంచి బయటి కొచ్చి కారిడార్లో నడిచి కుడిచేతి వైపు హాల్లో అడుగు పెట్టింది పద్మిని.

కిటికీ అద్దాల తలుపుల్లోంచి అందంగా కనిపిస్తోంది హైదరాబాద్ నగరం. ఇంకా పొగ మంచు పూర్తిగా విడిపోలేదు.

కాలం సీరియస్‌గా నడిచింది, సైలెంట్‌గా నడిచింది . ఎగ్జామ్ పూర్తయింది.

లంచ్ బ్రేక్ ...

కిందికి వచ్చి ఒక పక్కగా నిలబడింది పద్మిని. చాల మంది ఉన్నారు కాండిడేట్స్. కాని అమ్మాయిలు ఇంత తక్కువా! పూర్ ఆంధ్రా గర్ల్స్! డేరింగ్‌గా, డేషింగ్‌గా ఉండే అమ్మాయిలంటే ఎంత ఇష్టం విక్కీకి!

"ఇదిగో అప్లికేషన్!"

"దేనికి?"

"రేపు నువ్వు కలక్టర్ వయితే నీ కారు కి డ్రైవర్ అక్కర్లేదా?"

నవ్వింది పద్మిని. "ఇంకా నేను పరీక్ష రాయందే!"

"ఆఁ. చూడు మరి. ఇప్పట్నించీ పెడుతున్నాను. ఏ వెహికిల్ అయినా డ్రైవ్ చెయ్యగలను నేను. అప్పుడు నో పెకిన్సి బోర్డు చూపిస్తే ఫూరుకునేది లేదు."

"చూద్దాం." పోజుగా అంది. "ఇప్పటికే చాలా అప్లికేషన్లు వచ్చాయి."

కోపంగా ఆమె చెయ్యందుకున్నాడు. మెమ్మదిగా మెలిపెడుతూ "ఈ చెయ్యి విరిచి ఆ చేతిలో పెట్టేస్తాను—ఆ పోస్ట్ ఇంకెవరికైనా వెళ్ళిందంటే..."

"అబ్బా!" గట్టిగా అతని చేతి మీద కొట్టి తన చెయ్యి విడిపించుకుంది. "ఒట్టి అడివి మనిషి."

"ఒక షరతు అయితే!" చేతిమీద మువ్విరంగా రాసుకుంటూ అంది.

"ఏంటి?"

"నన్ను డార్జిలింగ్‌లో రోప్‌వేస్ ఎక్కించాలి."

అతని కళ్ళు మెరిశాయి. "నో ... అదేంటనేవు! ఈ సారి వాతో వచ్చెయ్. రోప్‌వే ఒక్కటే నేంటి—ఒక ఎయిర్ క్రాఫ్ట్ తీసుకొని ప్రపంచమంతా తిరుగుదాం."

"ఎక్స్‌క్యూజ్ మీ ... యువార్ వెయిటింగ్ ఫర్ ఎనీబడీ?"

"నో!"

ఒక నిమిషం ఆగింది ఆ అమ్మాయి. "ఈ బిర్లా మందిర్ ఎప్పుడయినా చూశారా మీరు?"

"లేదు."

"నేనూ చూడలేదు. ఇంకా గంటన్నర టైముంది. వెళ్ళి చూద్దామా?"

"ఒద్దొద్దు." కంగారుగా అంది. అది విక్కీతోనే చూడాలి.

"నాకు చాలా ఆకలిగా ఉంది. ముందేదయినా రెస్టారెంట్‌కి వెళ్ళాలి."

హోటల్ కామత్...

"బై దవే ... అయామ్ సీతా ... యు ఆర్ మిస్ ..."

"పద్మిని."

"గ్లాడ్ టు మీట్ యు." నేను ఐ. ఓ. బి. లో పనిచేస్తున్నాను. మాది మద్రాస్. అయినా ఎప్పుడూ అక్కడ ఉండలేదు."

"మాది విశాఖపట్నం."

"విశాఖపట్నం!" ఆమె మొహంలో తియ్యని జ్ఞాపకాల నీడలు. "జస్ట్ ఎ మినిట్..." లేచింది.

రెస్టారెంట్ అంతా చాలా బిజీగా ఉంది రిజర్వ్ బ్యాంక్ కాండిడేట్స్‌తో. ఎంత హాయిగా, ఉత్సాహంగా ఉన్నారు వీళ్ళంతా!

సీతా కౌంటర్ దగ్గరి కెళ్ళి రింగ్ చేస్తోంది ఎవరికో! ఆమె బుగ్గల్లో గులాబులు పూస్తున్నాయి. ప్లెజెంట్‌గా, హేపీగా ఉంది మొహం.

ఒక్కసారి రింగ్ చేసి చూస్తే...

"అమ్మా! మీకు ఫోన్..." పరమ బోరింగ్‌గా ఉన్న ఆ క్లాస్ లోంచి ఏ వంకతో లేచి పోదామా అని చూస్తున్న పద్మిని గబగబా బయటికి వచ్చింది.

ప్రొఫెసర్ రూమ్‌లోకి తొంగి చూసింది. ఆయన లేరు. ఒక్క పరుగున వెళ్ళి ఫోనందుకుంది.

"హల్లో!"


"హలో... హూ ఈజ్ స్పీకింగ్?"

గుర్తు పట్టింది పద్మిని. "పద్మిని...ది గ్రేట్!"

"ఎవరూ... చిత్తూరు రాణి పద్మినా?"

"అంతొద్దు ఎక్కువే! ది గ్రేట్ విక్రమ్ హృదయ సామ్రాజ్య మహారాణిని. ఇంతకీ తమరెవరు?" రాయల్‌గా అడిగింది.

"విక్రమ్ ది గ్రేటెస్ట్. ఫుట్‌బాల్ ప్లేయర్. ఎయిర్‌ఫోర్స్ టీమ్ కెప్టెన్."




"ఓ...ప్లీజ్డ్ టు మీట్ యూ—మీ గురించి చాలా విన్నాను. పేపర్సులో చదివాను." కుర్చీలో కూర్చుంటూ తాపీగా అంది.

"ఏమని?"

"మీ రెంత బాగా ఆడతారో అంతకు మించిన రౌడీ అని. మీ దృష్టిలో పడిన ఏ ఆడపిల్ల ఇంతవరకు సేఫ్‌గా తప్పించుకోలేదనీ, పేరు మోసిన డాకూ లందరికీ మీరు నాయకులనీ... ఇంకా..."

"ఇంకా...ఇంకా...అంతేనా...ఇంకా ఉన్నాయా?"

"ఇంకా చాలా ఉన్నాయి. గుర్తు రావడం లేదు."

"నేను గుర్తు చేస్తాను. సాయంత్రం సామ్ బీచ్‌కి వస్తే..."

"సారీ, రేప్పొద్దున్న సెమినార్‌కి ప్రిపేరవాలి."

"అదంతా నాకు తెలీదు. యు మస్ట్ కమ్."

". . ."

"హలో... మహారాణిగారూ! వస్తున్నారా?"

"నో."

"రాకపోతే ఇప్పుడే డిపార్టుమెంటుకి వచ్చి, అందరి ముందు ఎత్తుకుని మరీ వచ్చేస్తాను."

"ఓ.. .విక్కీ..." గారాలు పోతూ అంది.

"సరే, నేనే వస్తున్నాను."

ప్రొఫెసర్ స్వింగ్ డోర్స్ తెరుచుకుని లోపలికి వచ్చాడు.

"హాఁ!" గబుక్కున కుర్చీలోంచి లేచింది. "సాయంత్రం కలుద్దాం." గబుక్కున ఫోన్ పెట్టేసి "సారీ, సర్" అని స్వింగ్ డోర్స్ తెరుచుకుని గబగబా వెళ్ళిపోయింది.

"ఆర్డర్ చేసేరా ఏమయినా?" సీతా వచ్చింది.

"ఆఁ. వెజిటబుల్ బిర్యానీ... ఐస్‌క్రీమ్..."

"గుడ్, సాయంత్రం అజిత్ వచ్చి పికప్ చేసుకుంటాడట." కూర్చుంటూ అంది.

"అజిత్!"

"అజిత్, నేను అహమ్మదాబాద్‌లో ఒకేసారి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాం. నేను ఎకనామిక్స్. తను ఎమ్. ఇ. కొన్నాళ్ళు వైజాగ్ కాల్టెక్స్‌లో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేశాడు. ఇప్పుడిక్కడ ఎయిర్‌లైన్స్‌లో సెలెక్టయాడు. వైజాగ్‌లో ఉన్నన్నాళ్ళు అక్కడ బీచ్, కొండలు... అందాలన్నీ వర్ణించి రాస్తుండే వాడు. ఒక్క నాల్రోజు లుండి వెళ్ళమని ఎన్నోసార్లు అన్నాను. మొత్తానికి ఒక్కసారికూడా వెళ్ళడం అవలేదు. ఆ కోరిక అలా ఉండిపోయింది. ఇట్స్ డ్రీమ్ వరల్డ్ ఫర్ మీ."


ఇట్స్...ఎ...డ్రీ...మ్...వరల్డ్... ఫర్... మీ...

సాయంకాలపు నీరెండలో కెరటాల అంచుల్ని టచ్ చేస్తూ నడుస్తున్నారు పద్మిని, విక్రమ్. ఒకరి చేతిలో మరొకరి చెయ్యి...అడ్డంగా...వూళ్ళోని కుళ్ళు నీరు సముద్రంలో కలిసి పోయే చిన్న కాలువ. ఆగారు.

"అమ్మో! ఎలా దాటడం?" ఇబ్బందిగా అంది.

"ఇంత చిన్న కాలువ దాటలేకపోతే ఇంత పెద్ద సముద్రాన్నేం దాటుతావు?"

"అది కాదు—ఈ కుళ్ళు నీళ్ళు..."




"ఏం ఫరవాలేదు." దిగాడు విక్రమ్ పాంటు పైకి మడిచి కొద్దిగా.

రెండడుగులు వేసి వెనక్కి తిరిగాడు.

"కమాన్, బేబీ. నే నేం ఎత్తుకుని దాటించ లేను. నా కాళ్ళు కుళ్ళిపోతే నువ్వు హాయిగా దాటొద్దా మనుకున్నావా?"

"నే నేమీ అనుకోలేదు. అసలు దాటక్కర్లేదు. వెనక్కి పోదాం రా."

"లేదు. దాటాల్సిందే." ఆమె చెయ్యందుకుని ముందుకి లాగాడు. అతని మీద కొచ్చి పడింది. కెవ్వుమంది పద్మిని. పాదాల మీదుగా కుచ్చెళ్ళ చివర్లను తడుపుతూ ప్రవహిస్తోంది కుళ్ళు నీరు—నిశ్శబ్దంగా. గట్టిగా పట్టుకుం దతని చెయ్యిని. "ఇలా నిలుచుంటే లాభం లేదు. కుళ్ళు నీళ్ళలో ఎంత సేపని నానుతాం?"

ఆమె చెయ్యి పట్టుకుని మెల్లిగా నడిపించాడు.

ఇసకలోకి రాగానే విరుచుకు పడింది పద్మిని. "ఇప్పుడా కుళ్ళు కాలువ దాటకపోతేనేం? చూడు నా కాళ్ళు ఎలా పాడయిపోయాయో? చీరకూడా తడిసి పోయింది." పాదాలు చూసుకుంటూ, చీర కుచ్చెళ్ళు ఎత్తి పట్టుకుని దులుపుతూ అంది.

నిశ్చలంగా ఆమెనే చూస్తున్నాడు విక్రమ్. మెల్లిగా తల మీద చేయి వేసి జుట్టు పట్టుకుని వెనక్కి వంచి కళ్ళలోకి చూస్తూ అన్నాడు: "సారీ, డియర్. నిన్ను చాలా కష్ట పెట్టాను కదూ!"

విదిలించుకుంది పద్మిని.

కొద్దిగా కిందికి వంగి చటుక్కున రెండు చేతుల మీదుగ ఆమె నెత్తుకున్నాడు.

"ఆయామ్ టూ వైల్డ్ ఆవ్ యూ... నీ ఇష్టం వచ్చినట్టు నన్ను శిక్షించు, బేబీ..." మాట్లాడ లేదు పద్మిని. నిశ్చలంగా, నిర్మలంగా ఉన్న అతని కళ్ళ వెనుక కనబడని అగాధాన్ని చూస్తోంది...

"ఏ హోర్ ఔర్ బాహే...మేరీ అమానత్ హై..." చిన్నగా హమ్ చేసేడు. మాట్లాడలేదు పద్మిని. అతని మెడ చుట్టూ చేతులు వేసి గుండెలో మొహం దాచుకుంది...

"ఖూనే జిగర్ దే బులాయా గయా హై మేరే లియే..." హాయిగా కళ్ళు మూసుకుని అతని గుండె చప్పుడువింటూంది పద్మిని. మెల్లిగా నడుస్తున్నాడు విక్రమ్. నిశ్శబ్దంగా నలుచటి కాంతిని వెద జల్లుతున్నాయి నక్షత్రాలు. సముద్రం సైలెంట్‌గా ఘోషిస్తున్నది. ప్రకృతి అంతా నిశ్శబ్దంగా ఏదో వ్యక్తం చెయ్యలేని హాయిని, సంతోషాన్ని అనుభవిస్తున్నట్టుగా ఉంది.

ఆ తాదాత్మ్యంలో—తన్మయత్వంలో ఎంత కాలమో—ఎంత దూరమో....

సడెన్‌గా ఏవో హెడ్ లైట్లు పడగానే కళ్ళు తెరిచింది పద్మిని.

"అరె—రోడ్డు మీద కొచ్చేశామ్."

ఆమెనే చూస్తున్న విక్రమ్ ఒక్కసారి ముద్దు పెట్టుకుని దించేడు.

చుట్టూ చూసింది పద్మిని. రోడ్డు కాదు. అక్కడక్కడ పల్చగా ఉన్నారు మనుషులు. ఎవరి గొడవల్లో వారు....

"ఒంటి గంట దాటింది. ఇంక వెళ్దామా?" సీతా.

"పదండి. రెండు గంటలకి కదా పరీక్ష?" లేచేరు.

"ఈ పేపర్ ఎలా ఉంటుందో ఏమో? పొద్దున్న బాగానే ఉంది." నడుస్తున్నారు.

"ఈ లాస్ట్ మూమెంట్‌లో వాటి గురించి ఆలోచన—డిస్కషన్ అనవసరం. మనల్ని మనం కన్ఫ్యూజ్ చేసుకోవడమే అవుతుంది." కాంపౌండ్‌లో లాన్‌లో కూర్చున్నారు.

"ఎండే" తిరగేస్తోంది పద్మిని. ఇండియాని 'ప్రెసిడెన్షియల్' ఫార్మ్ ఆవ్ గవర్నమెంట్‌గా మార్చే విషయంమీద వివిధ భావాలు...ప్రెసిడెంటా?... ప్రధాన మంత్రా!...ఎవరయితేనేం?...ఏ రాయయితేనేం పళ్ళూడ గొట్టుకోడానికి...

నిమల్ డ్రాపెన్...చిన్న రౌండ్ టేబుల్‌కి అటూ ఇటూ కూర్చుని—కొవ్వు వత్తి వెలుగులో—ఒకరి కళ్ళలో ఒకరు చూసుకుంటూ—లోకాన్ని మరిచి పోయి—వాటె లవ్లీ కపుల్!...

పింక్ ఎలిఫెంట్...డిమ్ లైటింగ్... లేత ఎరుపు రంగులో కోజీగా ఉంది వాతావరణం...సన్నగా వెస్టర్న్ మ్యూజిక్...కార్నర్ టేబుల్...లేత నారింజ రంగు—కొవ్వు వత్తుల వెలుగులో ఆమె కళ్ళు, బుగ్గలు, పెదవులు...అందంగా మెరుస్తున్నాయి.

"ఎలా రాసేవు పరీక్షలు? ఇంటర్వ్యూ ఎప్పుడు?"

"బాగానే రాసేను...ఇంకా నాలుగైదు నెలలు పట్టవచ్చు."

"మరి...నా పోస్ట్ సంగతి మర్చిపోకూడదు."

"పోస్ట్ ఏమిటి?..."

"అదే...నీ కారు డ్రయివరు..."

"హోహ్... అదా...." నవ్వింది.

"నువ్వు స్టైలిగా, ట్రిమ్‌గా తయారయి వచ్చి...'డ్రయివర్' అని పిలవగానే గబగబా పరుగెత్తుకుని వచ్చి "ఎస్, మేమ్ సాబ్" అని తలొంచుకుని డోర్ తెరిచి పట్టుకుని..."

"ఆఁ...ఇంక చాలు...అర్థమయింది నీ లాయల్టీ. కాని అప్పుడు నువ్వుండేది ఔట్ హౌస్‌లో కాదు. డ్రైవ్ చేసేది నువ్వు కాదు..." కొవ్వు వత్తి స్టాండ్ మీద డిజైన్‌ను చూస్తూ అంది.

"మరి..." భయం నటిస్తూ అడిగేడు.

"హాయిగా నా ఇంట్లో ఉంటావు...కారు నేనే డ్రైవ్ చేస్తాను...నువ్వు నా పక్కనే కూచుంటావు..." ఐస్‌క్రీమ్ తింటూనే...అతని వైపు ప్రేమగా చూస్తూ అంది.

"మరి నేనెందుకు?...అప్పుడందరూ ఏమను కుంటారో తెలుసా? ఆఫ్టరాల్ ఒక కారు డ్రైవర్‌తో..."

"నాన్సెన్స్...ఎవరేమనుకున్నా నాకు భయం లేదు. అస లలా అనుకునే అవసరమే రాదు." స్థిరంగా అంది.

"హమ్ సే తుమ్ జుదా నహీ—తుమ్ సే హమ్ జుదా నహీ..." హాయిగా, మత్తుగా ఆశా గొంతు.

"విక్కీ...ఎలా ఉందిది?"

"బ్యూటిఫుల్...ఎక్కడిదీ?" శంఖం మీద సూర్యాస్తమయపు రంగులు, సముద్రం, చిన్నగా పిడల్లా రెండు మానవాకారాలు...గుండ్రని మలుపులో చిన్నగా రాసిన అక్షరాలు—"పద్మిని, విక్రమ్."

"గుర్తు తెచ్చుకో—ఎక్కడిదో?" నవ్వింది చిన్నగా.

"హోహ్, వండర్‌ఫుల్! ఆర్టిస్టిక్!"

"నీ కోసమే ఇది." మెల్లిగా, ప్రేమగా అంది.

టేబుల్ మీద వెనక్కి వాల్చిన ఆమె అరచేతిని అతి ప్రేమగా నొక్కుతూ అన్నాడు... "నీ ఈ తీవ్రమయిన ప్రేమకి నే నర్హుణ్ణి కాను, పద్మినీ..."

మధ్యాహ్నం పరీక్ష పూర్తయింది. రాయడం పూర్తి చేసి కిటికీలోంచి బిజీగా తిరిగే వాహనాల్ని చూస్తోంది పద్మిని.

ఒక్కసారి ఆమె కళ్ళు మెరిసాయి. గేటులోకి అడుగు పెడుతున్నాడు శ్రీనివాస్. అయిదవుతోంది టైమ్. పేపర్ ఇచ్చేసి బయటి కొచ్చింది. గబగబా లిఫ్ట్ వైపు నడిచింది. ఎంగేజ్డ్—ఇంకేం ఆలోచించకుండా గబగబా మెట్లు దిగడం మొదలెట్టింది. శ్రీనివాస్...ఏమంటాడు శ్రీనివాస్?

రొప్పుతూ కిందికి దిగి బయటికొచ్చి అటూ ఇటూ చూసింది—పక్కనించి వచ్చేడు శ్రీనివాస్.

"హలో—ఎలా రాసేరు పరీక్ష? సెలెక్టవుతారా?" చటుక్కున పక్కకి తిరిగింది పద్మిని.

"అది నా చేతుల్లో లేదు." ఆత్రంగా చూస్తోంది. ఆమె కళ్ళలో ఎన్నో ప్రశ్నలు...

"చాలా నీరసంగా ఉన్నారు—టీ తాగుదాం, రండి."

"ఇంతకీ..."

"ముందు కాస్త అలసట తీర్చుకోండి."

"నాకే అలసటా లేదు. ప్లీజ్, చెప్పండి. ఏమయింది?"

వినిపించుకోకుండా ముందుకు దారి తీశాడతను. అసహనంగా నడిచింది పద్మిని.

హోటల్ కామత్!

"కనుక్కున్నారా ఎడ్రస్?" భయంగా, ఆత్రంగా అడిగింది.

నవ్వేడు శ్రీనివాస్—"అతనింటికే వెళ్ళాను."

"నిజం!" ఆమె కళ్ళలో ఎన్నో నక్షత్రాలు వెలిగేయి. మండే హృదయంమీద చల్లగా పన్నీరు కురిసింది. గబగబా బేగ్ తెరిచి, ఏదో వెదికి ఒక బాల్‌పెన్ బయటికి తీసింది.

"తీసుకోండి."

రిచ్ వైట్ మార్బుల్‌లా... ఇంపోర్టెడ్ స్టఫ్‌లా ఉంది. "ఎందుకూ?" ఆశ్చర్యంగా, ఇబ్బందిగా అడిగాడు.

"ప్లీజ్ నా ఆత్రత మీ కర్థం కాదు. మీరు చేసిన సహాయం సామాన్యమయినది కాదు. నే నెప్పుడూ మర్చిపోలేను. కాదనకండి" అతని దగ్గరగా తోసింది.

ఆమె సంతోషం, ఆత్రత, తీవ్రత చూస్తుంటే అతనికి ఆశ్చర్యంగానూ, భయంగానూ ఉంది.

"కాని ... కాని ..." ఎలా చెప్పాలో తెలీదన్నట్టు చూసేడు శ్రీనివాస్.

"మీకు చాలా శ్రమ ఇచ్చేను. మీ కెలా థాంక్స్ చెప్పుకోవాలో తెలియడుం లేదు."

"నో ... నో ... ఇట్స్ మై ప్లెజర్."

"ఇంతకీ ఏమన్నాడు విక్రమ్?" ఇంకా అదే ధోరణిలో అడిగింది.

"నేను వెళ్ళేసరికి అతను లేడు. అతని మిసెస్ ఉంది."

"మిసెస్? మరి విక్రమ్?"

"విక్రమ్...ఇవాళ మినార్‌లో వెళ్ళిపోతున్నాడు."

"ఎక్కడికి? మళ్ళీ ఎప్పుడొస్తాడు?" గాభరాగా అడిగింది.

"బహుశా ఇంక రాడేమో... బరోడా ట్రాన్స్‌ఫర్ మీద ..."

ఇంకేం వినిపించలేదు పద్మినికి. వెయ్యి అటం బాంబులు ఒక్కసారే పేలేయి.

చటుక్కున లేచి నిలబడింది. "పదండి వెళ్దాం."

"ఎక్కడికి? ముందు టీ తాగండి."

వినిపించుకోలేదు పద్మిని. గబగబా ముందుకి నడిచింది.

ఆఖరి దశలో ఉన్న యుద్ధ రంగంలా ఉంది ఆమె బుర్రంతా.

"అరె... పద్మినీ! ఎక్కడికి? స్టేషన్‌కా? మినార్ నాలుగ్గంటలకే వెళ్ళిపోయింది. ఎంత లేటయినా అరగంట కన్న అవదు."

షాక్ తిన్నట్టు చూసింది పద్మిని, ఒక్క నిముషం—చురుగ్గా కదిలి కౌంటర్ దగ్గరి కెళ్ళి ఫోన్ చేసింది.

"హలో ... మినార్ వెళ్ళిపోయిందా?" ఊపిరి బిగపట్టింది.

"లేదు—గంట లేటివాళ. ఇంకా పావుగంటలో బయలుదేరుతుంది."

"ఓహ్! థాంక్యూ—థాంక్సలాట్."

గబుక్కున వెనక్కి తిరిగి ఆశగా అంది: "ఇంకా పావు గంట టైముంది. వెళ్దాం పదండి."

గబగబా రోడ్డుమీది కొచ్చి ఆటోను పిలిచింది.

"స్టేషన్‌కి."

"ఏ స్టేషన్?"

శ్రీనివాస్ వైపు తిరిగింది.

"పద్మినీ...మనం వెళ్ళేసరికి ఆ పావుగంట అయిపోతుంది."

వినిపించుకోలేదు పద్మిని. వెంటనే ఎక్కి కూచుంది "ప్లీజ్ గెటిన్—హరియప్."

ఆటో బాణంలా దూసుకు పోతూంది సికింద్రాబాద్ స్టేషన్ వైపు.

"యు ఆర్ మై ఎవి రి థింగ్." చెవిలో తియ్యగా విస్పర్ చేస్తున్న సన్నటి ధ్వని.

"కాస్త తొందరగా పోనీ." ఎంతో అసహనంగా కూర్చుంది పద్మిని. వాచీ చూడ్డానికే భయంగా ఉంది.

ఎట్ లాస్ట్...

పది రూపాయల నోటు ఆటోవాడి చేతిలో పెట్టి స్టేషన్‌లోకి పరుగెత్తింది పద్మిని. రెండో సారి విజిల్ వినబడింది.

ఇంత పెద్ద ట్రెయిన్‌లో ఎక్కడున్నాడు విక్రమ్!

ఆమె గుండె పగిలిపోతుందేమో అన్నంత స్పీడ్‌గా కొట్టుకుంటోంది.

పట్టుదలగా పరుగెడుతోంది—చురుగ్గా ప్లాట్‌ఫారం మీద, కంపార్ట్‌మెంటులోని మనుషుల్ని ఆత్రంగా చూస్తూ.

వోహ్! అదిగో విక్రమ్! — ఆవిడతో మాట్లాడుతూ...

ట్రెయిన్ కూత వేసింది

"విక్కీ ..." ఎగ్జైటింగ్‌గా అరిచింది పద్మిని.

ట్రెయిన్ కదిలింది.

పరుగెడుతోంది పద్మిని.

ట్రెయిన్ స్పీడందుకోగానే ఎక్కిపోయేడు విక్రమ్.

"విక్కీ ... విక్కీ ..." ఇంకా పరుగెడుతోంది పద్మిని.

ఇటుతిరిగి వేవ్ చెయ్యబోయిన విక్రమ్ చెయ్యి అలాగే ఉండిపోయింది.

ట్రెయిన్ మాత్రం దూరంగా...చాలా దూరంగా దృష్టి కందకుండా వెళ్ళి పోయింది.

అంతే ...

బ్రహ్మాండం బద్దలవలేదు. సముద్రాలు పొంగి పోలేదు. హిమాలయాలు కరిగిపోలేదు.

ఆమెలో ఆలోచనలు మాత్రం ఆగిపోయేయి. కంటిలో నీరు గడ్డకట్టింది. ఇన్నాళ్ళూ మండిన హృదయంలో బూడిద మాత్రం మిగిలింది.

ఆమె వైపు చూడ్డానికే భయం వేసిన శ్రీనివాస్ అతి నెమ్మదిగా, జాలిగా అన్నాడు: "పోదాం పదండి."

★

